క్లుప్తంగా

పూర్వవిద్యార్థుల చేయూత



ప్లేట్లు అందిస్తున్న పూర్వవిద్యార్థులు

లక్ష్మణచాంద: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు 2005–06 బ్యాచ్ పదోతరగతి పూర్వవిద్యార్థులు చేయూతనిచ్చారు. మంగళవారం తాము చదివిన పాఠశాలకు రూ.25వేల విలువైన 400 భోజన ప్లేట్లను విరాళంగా అందించి దాతృత్వం చాటుకున్నారు. హెచ్ఎం రాజు నాయక్, పూర్వ విద్యార్థులు గాండ్ల చిన్నయ్య, బొమ్మెన రాజేందర్, ఎంజలి అరుణ్, బొజ్జ రవి, బ్రహ్మాదండి సుమన్ పాల్గొన్నారు.

'సమస్యలు పరిష్కరించండి'



నిరసన తెలుపుతున్న ఆర్టీసీ ఉద్యోగులు

భైంసాటౌన్: పెండింగ్‌లో ఉన్న తమ సమస్యలు పరిష్కరించాలని పలువురు ఆర్టీసీ ఉద్యోగులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోని ఆర్టీసీ డిపో వద్ద నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు పెండింగ్ సమస్యల పరిష్కారం కోసం నిరసన తెలిపినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో గంగయ్య, స్వరూప్, గజ్జారాం, సుధాకర్‌బాబు, ముత్యం, మొయినొద్దీన్, పోతన్న, సుధాకర్ తదితరులున్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

పెంబి: ఎమ్మెల్యే బొజ్జుపటేల్ ఆదేశాల మేరకు మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన 12మంది లబ్ధిదారులకు మంగళవారం పెంబిలో సీఎంఆర్ఎఫ్ చెక్కులను కాంగ్రెస్ నాయకులు అందజేశారు. ఆ పార్టీ మండల అధ్యక్షుడు స్వప్నీల్‌రెడ్డి, నాయకులు తులాల శంకర్, చారి, గొర్ల రాజన్న, సుంచు శంకర్, గుడిసె రమేశ్, రాజేశ్వర్ తదితరులు ఉన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

లోకేశ్వరం: మండలంలోని నగర్ గ్రామశివారులో పేకాడుతున్న పలువురిని అరెస్టు చేసినట్లు ఎస్సై అశోక్ తెలిపారు. పక్కా సమాచారంతో మేరకు మంగళవారం సాయంత్రం దాడి చేసి 15మందిని అరెస్ట్ చేసినట్లు పేర్కొన్నారు. వారి నుంచి రూ.6440 నగదు స్వాధీనం చేసుకుని.. కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

ఎన్‌సీసీకి 50 మంది ఎంపిక



విద్యార్థులను ఎంపిక చేస్తున్న హవల్దార్

కడెం: మండలంలోని లింగాపూర్ జిల్లా పరిషత్ పాఠశాలలో ఇటీవల ఎన్‌సీసీని ప్రారంభించారు. మంగళవారం ఆదిలాబాద్ హవల్దార్ బ్రజేశ్‌కుమార్, సుబేదార్ భగీరథరామ్ ఎన్‌సీసీ యూనిట్ కోసం విద్యార్థులను ఎంపిక చేశారు. కంటిపరీక్ష, రన్నింగ్ తదితర పరీక్షల్లో ప్రతిభ కనబర్చిన యాభై మందిని ఎంపిక చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం వెంకటరమణ, ఎన్‌సీసీ అధికారి మహేశ్వర్, ఉపాధ్యాయులు కిషన్, బాలాజీ, వెంకటరమణ, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కజొన్న పంట ధ్వంసం

లక్ష్మణచాంద: మండలంలోని రాచాపూర్ గ్రామంలో బూసి ముత్యం అనే రైతుకు చెందిన మొక్కజొన్న పంటను అడవిపందులు ధ్వంసం చేశాయి. సోమవారం అర్ధరాత్రి అడవిపందుల గుంపు దాడి చేయడంతో పంట దెబ్బతిందని.. ప్రభుత్వం ఆదుకోవాలని రైతు వేడుకున్నాడు.

ఘనంగా తీజ్ సంబరాలు



గోధుమనారు బుట్టలతో గిరిజనులు

సారంగపూర్: మండలంలోని సాయినగర్ తండాలో మంగళవారం గిరిజనులు తీజ్ సంబరాలు నిర్వహించారు. పెళ్లికాని యువతులు మొలకెత్తిన గోధుమనారు బుట్టలను ఎత్తుకొని సేవాలాల్, జగదాంబ ఆలయాలకు వెళ్లి పూజలు చేశారు. అనంతరం బుట్టలను చెరువులో నిమజ్జనం చేశారు.

ఎమ్మెల్యేను కలిసిన నేతలు

కడెం: మండలంలోని అంబారిపేట్ గ్రామ కాంగ్రెస్ నాయకులు మంగళవారం ఉట్నూర్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే బొజ్జు పటేల్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. గ్రామ సమస్యలను వారికి వివరించి పరిష్కరించాలని కోరారు. అనంతరం ఎమ్మెల్యేను సత్కరించారు. పార్టీ సోషల్ మీడియా నియోజకవర్గ కోఆర్డినేటర్ రెంకల శ్రీనివాస్, రమేశ్, మహేందర్ ఉన్నారు.

అడుగడుగునా గుంతలే..

- అధ్వానంగా మల్లాపూర్–పార్‌పెల్లి రోడ్డు
- రాకపోకలకు ఇబ్బంది పడుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు



పార్‌పెల్లితండా సమీపంలో..



మాచాపూర్ వెళ్లే మార్గంలో గుంతలు పడిన రోడ్డు

లక్ష్మణచాంద: లక్ష్మణచాంద నుంచి మల్లాపూర్, మాచాపూర్, పార్‌పెల్లితండా, పార్‌పెల్లి, మీదుగా పొట్టపెల్లి(బి) వెళ్లే మార్గంలో ఉన్న ఐదు కిలోమీటర్ల బీటీ రోడ్డు గుంతలమయంగా మారింది. మల్లాపూర్ నుంచి పార్‌పెల్లి వరకు ఉన్న మూడు కిలో మీటర్ల రోడ్డు మాత్రం అధ్వానంగా మారింది. నిత్యం వివిధ పనుల నిమిత్తం ప్రజలు మండల కేంద్రానికి వచ్చి వెళ్తుంటారు. రోడ్డు గుంతలమయంగా మారడంతో రాకపోకలు సాగించేందుకు ప్రజలు, వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు.

ముప్పైకి పైగా గుంతలు..

మల్లాపూర్ నుంచి పార్‌పెల్లి వరకు ఉన్న మూడు కిలోమీటర్ల రోడ్డుపై అడుగడుగునా కంకరతేలి అధ్వానంగా మారింది. మూడు కిలోమీటర్ల రోడ్డుపై ముప్పైకి పైగా గుంతలు ఏర్పడ్డాయి. రోడ్డు మధ్యలో ఉన్న కల్వర్టుపై పోసిన మట్టి వర్షానికి కొట్టుకు పోవడంతో వాహనదారులకు ప్రమాదం పొంచి ఉంది. అధికారులు నిధులు మంజూరు చేసి రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు వేడుకుంటున్నారు.



పార్‌పెల్లి–మల్లాపూర్ మధ్య కల్వర్టు వద్ద కోతకు గురైన రోడ్డు

ప్రతిపాదనలు పంపాం



మల్లాపూర్ నుంచి పార్‌పెల్లి వెళ్లే మూడు కిలోమీటర్ల రోడ్డు దెబ్బతిన్న మాట వాస్తవమే. ఈ విషయమై ఉన్నతాధికారులకు నివేదిక సమర్పించాం. ప్రభుత్వం నిధులు మంజూరు చేయగానే పనులు చేపట్టి ఇబ్బందుల్లేకుండా చూస్తాం.

– సంజయ్‌కుమార్, ఏఈ, పీఆర్

ఇంటర్‌లో ప్రవేశాలకు ఆహ్వానం

ముధోల్: మండల కేంద్రంలోని తెలంగాణ సాంఘీక సంక్షేమ గురుకుల జూనియర్ కళాశాలలో ప్రథమ సంవత్సరంలో ఉన్న ఖాళీలను స్పాట్ అడ్మిషన్ల ద్వారా భర్తీ చేయనున్నట్లు ప్రిన్సిపాల్ సీహెచ్. నరసింహారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బైపీసీలో ఎస్సీ-3సీట్లు, ఎస్సీ-సీ-1, మైనార్టీ-1, ఓసీలకు-1 మొత్తం ఆరు.. ఎంపీసీలో ఎస్సీ-సీ-1, బీసీ-2, మైనార్టీ-1, ఓసీ-1.. మొత్తం 5 సీట్లు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. మొదటి దఫాలో పదో తరగతి ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు అర్హులని.. టీసీ, కుల, ఆదాయ తదితర ధ్రువపత్రాలతో గురువారం ఉదయం 11గంటలకు కళాశాలకు రావాలని సూచించారు. వివరాలకు 9848451133 నెంబర్‌లో సంప్రదించాలన్నారు.

లెఫ్ట్ పోచంపాడ్‌లో..

సోన్: మండలంలోని లెఫ్ట్ పోచంపాడ్ సాంఘీక సంక్షేమ గురుకుల బాలికల కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం హెచ్ఈసీ గ్రూప్‌లో 15 సీట్లు ఖాళీగా ఉన్నాయని.. విద్యార్థులు ఈనెల 29లోగా దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ ఆర్.ప్రశాంతి మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 2024లో పదోతరగతి పూర్తి చేసిన విద్యార్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో కళాశాలలో సంప్రదించాలని సూచించారు.

కేసులు ఎప్పటికప్పుడు పరిష్కరించాలి



మాట్లాడుతున్న సీఐ నవీన్‌కుమార్

లక్ష్మణచాంద: కేసులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సోన్ సీఐ నవీన్‌కుమార్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను సోన్ సీఐ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా స్టేషన్లో ఉన్న రికార్డులు పరిశీలించి పెండింగ్ కేసుల వివరాలను తెలుసుకున్నారు. అనంతరం గణేశుడి ఉత్సవాలపై సిబ్బందికి పలు సూచనలు చేశారు. మండపాల నిర్వాహకులతో సమావేశం నిర్వహించి తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్సై సుమలత, సిబ్బంది కిరణ్, అశోక్ తదితరులు ఉన్నారు.

ఉత్సవాలు ప్రశాంతంగా జరుపుకోవాలి

సారంగపూర్: గణపతి నవరాత్రి ఉత్సవాలను శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని ఎస్సై శ్రీకాంత్ సూచించారు. ఎస్పీ జానకీషర్మిల ఆదేశాల మేరకు మంగళవారం మండలంలోని స్వర్ణ గ్రామంలో గణేశుడి మండపాల నిర్వాహకులతో మాట్లాడారు. మండపాల నిర్వాహకులు అనుమతికి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. విద్యుత్‌శాఖ అనుమతితోనే విద్యుత్ సౌకర్యం ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. మండపాల వద్ద నిత్యం నిర్వాహకులు కాపలా ఉండాలన్నారు. అవాంఛనీయ ఘటనలకు పాల్పడకుండా పోలీసులకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో గణేశుడి మండపాల నిర్వాహకులు, గ్రామస్తులు, సిబ్బంది తదితరులు ఉన్నారు.

అలరించిన కృష్ణాష్టమి వేడుకలు

బాసర: మండల కేంద్రంలో మంగళవారం శ్రీ కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. యాదవసంఘం ఆధ్వర్యంలో ప్రత్యేక వాహనంలో గోపాలుడి చిత్రపటం ఉంచి శ్రీకృష్ణుడి ఆలయం వరకు ఊరేగింపుగా వెళ్లారు. చిన్నారులు కృష్ణుడు, గోపికల వేషధారణలో ఆకట్టుకున్నారు. ఆలయం వద్ద పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు.

కుభీర్: మండల కేంద్రంలోని కృష్ణుడి మందిరంలో మంగళవారం శ్రీకృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాల అనంతరం పూజలు చేశారు. దార్‌కుభీర్‌లోనూ అన్నదానం చేశారు.

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని శ్రీనగర్‌కాలనీలో కృష్ణాష్టమి వేడుకలను సోమవారం రాత్రి నిర్వహించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన ఉట్టి కొట్టిన వారికి రూ.2001 బహుమతి అందజేశారు. అనంతరం అల్పాహారం ఏర్పాటు చేశారు. కాలనీ అధ్యక్షుడు బొద్దుల భానుచందర్, ప్రధాన కార్యదర్శి రాకేశ్‌సింగ్, సాయినాథ్, రాజు పాల్గొన్నారు.



బాసరలో శోభాయాత్రలో పాల్గొన్న మహిళలు

ఖానాపూర్: పట్టణంలోని శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజల అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో జారుడుగుంజ పాకుడు నిర్వహించారు. హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో జగన్నాథ్‌రావు చౌరస్తాలో ఉట్టి కొట్టే కార్యక్రమం నిర్వహించారు. ఎస్సై లింబాద్రి, మున్సిపల్ వైస్ చైర్మన్ సంతోష్, సురేశ్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



కుభీర్‌లో పూజలు చేస్తున్న భక్తులు



ఖానాపూర్‌లో ఉట్టి కొడుతున్న యువకుడు

'సీపీఎస్ రద్దు చేయాలి'



సభ్యత్వం అందిస్తున్న పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు నరేంద్రబాబు

లోకేశ్వరం: సీపీఎస్ రద్దు చేసి 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ వర్తింపజేయాలని పీఆర్టీయూ సంఘం జిల్లా అధ్యక్షుడు నరేంద్రబాబు అన్నారు. మంగళవారం మండలంలోని జెడ్పీ పాఠశాలలో పీఆర్టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న ఐదు డీఏలను విడుదల చేయాలన్నారు. నూతన హెల్త్ స్కీం రూపొందించి ప్రభుత్వ ఉద్యోగ ఉపాధ్యాయులతో పాటు మోడల్ స్కూల్ ఎయిడెడ్, గురుకుల ఉపాధ్యాయులకు వర్తింపజేయాలని కోరారు. ఎయిడెడ్, మోడల్, గురుకులాల ఉపాధ్యాయులకు 010 పద్దు ద్వారా వేతనాలు అందించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో పీఆర్టీయూ మండలాధ్యక్షుడు రాజారాం, ప్రధాన కార్యదర్శి సురేశ్‌రావు, పలువురు నాయకులు రాజేందర్, అశోక్ ఉన్నారు.

'పెండింగ్ బిల్లులు చెల్లించాలి'

భైంసాటౌన్: గ్రామపంచాయతీల్లో చేసిన అభివృద్ధి పనులకు సంబంధించిన పెండింగ్ బిల్లులను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని మాజీ సర్పంచ్‌లు డిమాండ్ చేశారు. మంగళవారం ఆర్డీవో కార్యాలయ ఆవరణలో బైఠాయించి నిరసన తెలిపారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. తమ పదవీకాలంలో సొంత నిధులతో గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టామని.. బిల్లులు రాక ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నామన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా పెండింగ్ బిల్లులు మంజూరు చేయాలని కోరారు. అనంతరం ఆర్డీవో కోమల్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నియోజకవర్గంలోని మాజీ సర్పంచ్‌లు డి రాజు, రాకేశ్, కిషన్, సాయినాథ్ తదితరులు పాల్గొన్నారు.

వ్యాధులపై అవగాహన పెంచుకోవాలి

భైంసారూరల్: సీజనల్ వ్యాధులపై ప్రజలు అవగాహన పెంచుకోవాలని ఎంపీడీవో సుధాకర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని కామోల్ గ్రామంలో ఆరోగ్య సిబ్బందితో కలిసి డ్రై డే కార్యక్రమం నిర్వహించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వారంలో మంగళవారం, శుక్రవారం డ్రై డే కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. ఇళ్ల ముందు ట్యాంకులు, కూలర్లు, కుండీల్లో నీటిని నిల్వ ఉంచొద్దని సూచించారు. హెల్త్ సూపర్‌వైజర్ సలీం, ఏఎన్ఎంలు, ఆశాకార్యకర్తలు తదితరులు ఉన్నారు.

ఖానాపూర్: మండలంలోని సింగాపూర్, చందునాయక్‌తండా గ్రామాల్లో మంగళవారం ఎంపీవో రత్నాకర్‌రావు ఆధ్వర్యంలో పారిశుధ్య నిర్వహణపై అవగాహన కల్పించారు. డ్రెయినేజీల్లో పూడికతీతతోపాటు దోమల నిర్మూలనకు బయో లార్వా స్ప్రేయింగ్ చేయాలని సిబ్బందికి సూచించారు. పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

తానూరు: గ్రామాల శుభ్రతపై దృష్టి సారించాలని మండల ప్రత్యేకాధికారి శ్రీనివాస్ సూచించారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బందికి నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో మాట్లాడారు. వర్షాకాలం నేపథ్యంలో మురికి కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రపరిచి గ్రామస్తులకు క్లోరినేషన్ నీటిని అందించాలన్నారు. నాటిన మొక్కలు ఎండిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వార్డుల వారీగా ఓటరు జాబితలను తయారు చేయాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో అబ్దుల్ సమద్, ఎంపీవో నసీరొద్దీన్, ఈజీఎస్ ఏపీవో గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న ఎంపీడీఓ సుధాకర్‌రెడ్డి



మాట్లాడుతున్న మండల ప్రత్యేకాధికారి శ్రీనివాస్

లక్ష్మణచాంద: ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లో పారిశుధ్య పనులు చేయించాలని ఎంపీడీవో రాధ పేర్కొన్నారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. దోమల నివారణకు ఫాగింగ్ చేయించాలన్నారు. వారంలో రెండు రోజులు డ్రై డే నిర్వహించి ప్రజలకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీవో అమీర్‌ఖాన్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

వేతనాలు చెల్లించాలని నిరసన



నిర్మల్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు

నిర్మల్‌టౌన్: తమకు రావాల్సిన పెండింగ్ వేతనాలు చెల్లించాలని మున్సిపల్ కాంట్రాక్టు పారిశుధ్య కార్మికులు రెండోరోజు విధులు బహిష్కరించారు. మంగళవారం స్థానిక గాంధీపార్క్‌లో సమావేశమై తమ ఆవేదన వ్యక్తం చేశారు. నాలుగు నెలలుగా వేతనాలు రాక కుటుంబ పోషణ భారంగా మారిందని.. అప్పులు చేసి జీవనం సాగిస్తున్నామని పేర్కొన్నారు. అంతకుముందు మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ సీవీఎన్ రాజుతో చర్చలు జరిపారు. పెండింగ్ వేతనాలు, పీఎఫ్ చెల్లించే వరకు విధుల్లో చేరబోమని కమిషనర్‌కు తేల్చి చెప్పినట్లు కార్మికులు పేర్కొన్నారు.

ముధోల్: తమకు రావాల్సిన ఐదు నెలల వేతనం చెల్లించాలని మండలంలోని ఎడ్‌బిడ్ గ్రామ పంచాయతీ కార్మికులు మంగళవారం విధులు బహిష్కరించారు. అనంతరం పంచాయతీ కార్యదర్శి శివారెడ్డికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్మికులు ఉన్నారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి

లోకేశ్వరం: విద్యార్థులకు నాణ్యమైన విద్య, మెనూ ప్రకారం భోజనం అందించాలని ఎంపీడీవో సోలమాన్ రాజ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎస్సీ సంక్షేమ వసతిగృహం, కేజీబీవీని పరిశీలించి మాట్లాడారు. మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందించాలన్నారు. చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించేలా ప్రోత్సహించాలని పేర్కొన్నారు. అనంతరం కేజీబీవీలో రికార్డులు పరిశీలించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో సంక్షేమాధికారి రాజు, ప్రిన్సిపాల్ అనసూయ, సిబ్బంది ఉన్నారు.

నర్సాపూర్(జి): మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో మధ్యాహ్న భోజన తయారీని మంగళవారం తహసీల్దార్ శ్రీనివాస్ పరిశీలించారు. పరిశుభ్రత పాటించి విద్యార్థులకు మెనూ ప్రకారం రుచికరమైన భోజనాన్ని అందించాలని వంట సిబ్బందికి సూచించారు. అనంతరం ఉపాధ్యాయులతో మాట్లాడారు. ఆర్ఐ వేణుగోపాల్ ఉన్నారు.



భోజనం పరిశీలిస్తున్న తహసీల్దార్ శ్రీనివాస్

కార్యవర్గం

ఖానాపూర్: ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సంఘం ఖానాపూర్ నియోజకవర్గ కమిటీని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పట్టణంలోని ఆర్అండ్‌బీ విశ్రాంతిభవనంలో జరిగిన సమావేశంలో ఈ కమిటీని ప్రకటించారు. కమిటీ అధ్యక్షుడిగా అర్ల రమేశ్, ఉపాధ్యక్షుడిగా మల్లెపల్లి స్వామి, ప్రధాన కార్యదర్శిగా నేత శ్యాం, సహాయ కార్యదర్శులుగా శైలేందర్, దండు సతీశ్, కోశాధికారిగా మ్యాదరి రాజేశ్వర్, ముఖ్య సలహాదారులుగా డి.వెంకటేష్, పసుల రాజలింగం, ద్యావతి రాజేశ్వర్, కార్యవర్గ సభ్యులుగా కె.రాజశేఖర్, రమేశ్, నర్సయ్య, ముత్యం, రాజు, తిరుమలేష్ ఎన్నికయ్యారు.



ఎన్నికైన కార్యవర్గం

బీఆర్ఎస్ నేతల సంబురాలు

సోన్: బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితకు బెయిల్ వచ్చిన సందర్భంగా మంగళవారం మండలంలోని న్యూవెల్మల్, న్యూబొప్పారం గ్రామాల్లో ఆ పార్టీ నాయకులు టపాసులు కాల్చి సంబురాలు చేసుకున్నారు. వర్దినేని కిరణ్‌కుమార్, గొల్ల మల్లయ్య, వెంకాయి సాయారెడ్డి, భూమేశ్, ప్రభాకర్ తదితరులున్నారు.

భైంసాటౌన్: ఎమ్మెల్సీ కవితకు లిక్కర్‌స్కాం కేసులో మంగళవారం బెయిల్ రావడంతో పట్టణంలో బీఆర్ఎస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు నియోజకవర్గ సమన్వయ కమిటీ నాయకుడు విలాస్ గాదేవార్ ఆధ్వర్యంలో టపాసులు కాల్చి మిఠాయిలు తినిపించుకున్నారు.

సంక్షిప్త వార్తలు

అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన

ఖానాపూర్: పట్టణంలోని విద్యానగర్ కాలనీలో మంగళవారం పలు దుకాణాల వద్ద అగ్నిప్రమాదాల నిర్మూలనకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అగ్నిమాపక సిబ్బంది దిలీప్‌కుమార్, శ్రీకాంత్, మనోజ్ ఆధ్వర్యంలో దుకాణాల నిర్వాహకులకు శిక్షణనిచ్చారు. ప్రమాదాల సమయంలో చేపట్టాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో వ్యాపారులు పరిమి రమేశ్, దూడం శంకర్, కోమటిపెల్లి రాజేశ్వర్ తదితరులు ఉన్నారు.

సన్మానం

లక్ష్మణచాంద: మండల వ్యవసాయాధికారిగా పని చేసిన ప్రవీణ్‌కుమార్ ఇటీవల బీజేఎల్పీ నేత మహేశ్వర్ రెడ్డి పర్సనల్ సెక్రెటరీగా నియమితులయ్యారు. ఏఈవోగా పని చేసిన ఉమామహేశ్వరి బదిలీపై సోన్‌కు వెళ్లారు. దీంతో మంగళవారం లక్ష్మణచాంద రైతువేదికలో ఏర్పాటు చేసిన సమావేశంలో చామన్‌పెల్లి రైతులు ఇరువురిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రమణ, గంగారెడ్డి, రాజారెడ్డి పాల్గొన్నారు.

కష్టపడి చదివితే భవిష్యత్తు

కుంటాల: కష్టపడి చదివితేనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని పీఏసీఎస్ చైర్మన్ సట్ల గజ్జారాం పేర్కొన్నారు. ఇటీవల వెలువడిన గురుకుల పీఈటీ ఫలితాల్లో కుంటాలకు చెందిన జుట్టు శ్రీకాంత్, ఎనుగందుల సాగర్ ఉద్యోగాలు సాధించగా వారిని మంగళవారం మండల కేంద్రంలో సన్మానించారు. పీఏసీఎస్ డైరెక్టర్ ప్రణయ్ రావు, దేవేందర్, సబ్బిడి గజేందర్, సబ్బిడి రాకేశ్ తదితరులు పాల్గొన్నారు.

వైద్యశిబిరం

సారంగపూర్: మండలంలోని జామ్ పంచాయతీ కార్యాలయం వద్ద మంగళవారం నిర్మల్‌లోని తిరుమల నర్సింగ్‌హోం ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా డాక్టర్ రమేశ్‌రెడ్డి రోగులను పరీక్షించి మందులు అందజేశారు. ఇళ్ల పరిసరాల్లో నీరు నిలువకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. విలాస్, తిరుమల నర్సింగ్ హోం సిబ్బంది, తదితరులు ఉన్నారు.

విత్తనాలు నాటుకోవాలి

సోన్: మండలంలోని కూచన్‌పెల్లి గ్రామంలో మంగళవారం డ్రీమ్ సంస్థ ఆధ్వర్యంలో రైతులతో 14 రకాల కూరగాయల విత్తనాలు నాటించినట్లు సంస్థ కోఆర్డినేటర్ చిన్నయ్య తెలిపారు. రసాయనాలతో పండించిన కూరగాయలు తింటే అనారోగ్య సమస్యలు వచ్చే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామాభివృద్ధి ఫోరం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

వంట సామగ్రి అందజేత

కుభీర్: మండల కేంద్రానికి చెందిన సాప పండరి కస్తూరిబాకు మంగళవారం రూ.ఆరు వేల విలువైన 30 కేజీల రెండు అల్యూమినియం గంజులను విరాళంగా అందించారు. కొప్పుల విజయ్, ప్రిన్సిపాల్ వాణి తదితరులు ఉన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

కడెం: రైతు సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని కాంగ్రెస్ పార్టీ మహిళావిభాగం జిల్లా అధ్యక్షురాలు చొప్పదండి దుర్గభవాని ఓ ప్రకటనలో తెలిపారు. ఇచ్చిన మాటకు కట్టుబడి దేశంలో ఎక్కడా లేని విధంగా ఏకకాలంలో రూ. రెండు లక్షలను రుణమాఫీ చేసిన ఘనత సీఎం రేవంత్‌రెడ్డికి దక్కుతుందని పేర్కొన్నారు.

నియోజకవర్గంలోని చెరువులను రక్షించాలి



ఆర్డీవోకు వినతిపత్రం ఇస్తున్న ప్రతినిధులు

భైంసాటౌన్: హైదరాబాద్‌లో హైడ్రా మాదిరి ముధోల్ నియోజకవర్గంలో చెరువుల భూములను రక్షించాలని సోషల్ జస్టిస్ ఫర్ హ్యూమన్ రైట్ కౌన్సిల్ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయంలో కోమల్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. కబ్జా చెరలో ఉన్న చెరువులను గుర్తించి పునరుజ్జీవ చర్యలు చేపట్టాలని కోరారు. కౌన్సిల్ జిల్లా డైరెక్టర్ దత్తు సింగ్, నియోజకవర్గ డైరెక్టర్ సాప పండరి, వైస్ చైర్మన్ పెంటాజీ, సాయి సూర్యవంశీ, వికాస్, సాయినాథ్ ఉన్నారు.